# జతగాడు

6-1-79

రాజ్యలక్ష్మి గారూ—

మీతో ఈ విషయాన్ని ముఖతా చెప్పలేక ఇలా ఉత్తరం ద్వారా తెలియజేస్తున్నాను. అపార్థం చేసుకోకుండా ఆసాంతం చదివి, ఆలోచించి ఓ నిర్ణయానికి రండి. మీ నిర్ణయానికి నేను బద్ధుడను. నాకు ఉద్యోగం వచ్చి సంవత్సరం దాటిపోవడంతో మా వాళ్లు పెళ్ళి చేసుకోమని వత్తిడి చేస్తున్నారు. మీరంటే నాకు మొదటి నుంచి ఓ ప్రత్యేకాభిప్రాయం. మీరు ఇష్టపడితే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని నా కోరిక. దయచేసి మీ అభిప్రాయాన్ని వెంటనే తెలియజెయ్యండి.

—శేఖర్,

7-7-79

డియర్ రాజూ—

ఎన్నాళ్లు నువ్వు పుట్టింట్లో వుంటావు? నువ్వు లేకుండా నాకు అన్నం సయించడం లేదు. నిద్రపట్టడం లేదు. తొందరగా వచ్చేయ్. ఈ వుత్తరం రేపు నీకు చేరుతుంది. రేపు రాత్రి నుంచే అటు నుంచీ వచ్చే ప్రతీ ట్రయిన్ దగ్గరకి వస్తాను. వెంటనే బయల్దేరు- అర్జంట్.

—నీ శేఖర్.

2-3-80

రాజ్యం—

ఇలా ప్రతీ చిన్న విషయానికీ అలిగి మాట్లాడకుండా కూర్చుంటే ఎలా? నేనేమన్నానని! నీ మౌనాన్ని భరించలేను. నీతో ఈ విషయాలన్నీ చెప్పాలని నిన్నటి నుంచీ ప్రయత్నిస్తున్నాను. కానీ నువ్వు మాట్లాడకుండా తప్పించుకు తిరుగుతుండడంతో ఇలా రాస్తున్నాను. సాయంత్రం నేను ఆఫీసునుంచీ వచ్చేటప్పటికి నువ్వు నవ్వుతూ ఎదురొచ్చి పలకరించాలి-సరేనా?

—నీ భర్త.
5-6-81

రాజ్యలక్ష్మి—

ఇలా నువ్వు చీటికి మాటికీ మాట్లాడడం మానేసి చిన్నపిల్లలా ప్రవర్తించడం నాకేమీ నచ్చలేదు. ఇన్నాళ్లూ నాతో మాట్లాడకపోయినా ఇంట్లోనే వుండేదానివి కాబట్టి నేనంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, ఇప్పుడు నువ్వు మరో మెట్టు దిగజారి కోపంతో పుట్టింటికి వెళ్ళావు. నిన్ను రమ్మని పిలవడానికి నేను ఈ వుత్తరం రాయడంలేదు. మళ్ళీ ఎప్పుడూ ఇలా ప్రవర్తించనని క్షమాపణలు చెప్పుకుంటే రా....

—శేఖర్.

(జ్యోతి మాసపత్రిక)